డిగ్రీ కళాశాలలో సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర - భీమిలి: భీమిలి ఎస్‌వీఎల్‌ఎంఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ వన్ టూ త్రీ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ విష్ణుమూర్తి పాల్గొని మాట్లాడుతూ ఈ సంక్రాంతి అందరిలో ఆనందం నింపాలని ఆకాంక్షించారు. విద్యార్థినులు సాంప్రదాయ వస్త్ర అలంకరణతో అలరించారు. ఈ సందర్భంగా కళాశాలలో రంగోలి పోటీలు, గాలిపటాల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కుపై మోడీ ప్రకటన చేయాలి

ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలి, లేదా సెయిల్‌లో విలీనం చేయాలి
వామపక్ష పార్టీల నాయకుల డిమాండ్

విశాలాంధ్ర - విశాఖ: విశాఖ పర్యటనకు బుధవారం వస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని రద్దు చేస్తున్నట్లు, సొంత గనులు కేటాయిస్తున్నట్లు, ప్లాంట్‌ను పూర్తి స్థాయి ఉత్పత్తి సామర్థ్యంతో నడిపించేందుకు అన్ని వనరులు కేటాయిస్తున్నట్లు స్పష్టంగా ప్రకటించాలని వామపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం విశాఖ ఉక్కును కాపాడలేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే విశాఖ ఉక్కు ప్రైవేటుపరం కాకుండా కాపాడతామని చెప్పిన చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు ప్రధానితో ఉక్కుపై స్పష్టమైన ప్రకటన ఇప్పించకపోతే చరిత్ర హీనులుగా మిగిలిపోతారని అన్నారు. ఎం.జగ్గునాయుడు, సిపిఐఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు, సిపిఐఎంఎల్ ప్రజాపోరు జిల్లా నాయకుడు సిహెచ్ దేవా, ఎంసిపిఐ జిల్లా నాయకులు శంకరరావు, ఎస్‌యుసిఐసి రాష్ట్ర నాయకులు ఎస్.గోవింద రాజులు మాట్లాడుతూ గత నాలుగేళ్ళుగా విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం, స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని ఉద్యమం జరుగుతుంటే, మోడీ నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారన్నారు. రెండేళ్ళ క్రితం ఇదే ఆంధ్రా యూనివర్శిటీ గ్రౌండ్‌కు మోడీ వచ్చినప్పుడు ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు స్పష్టమైన ప్రకటన చేయాలని మోడీని డిమాండ్ చేసిన విషయం గుర్తుంచుకోవాలన్నారు. ఈ రెండేళ్ళలో స్టీల్‌ప్లాంట్ బ్లాక్ ఫర్నేస్‌లను మూసివేసి ఉత్పత్తి తగ్గించే కుట్రలు పన్నడమే కాకుండా ఉద్యోగులకు, కార్మికులకు జీతాలు చెల్లించకుండా ద్రోహం చేస్తున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌లు స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదని ప్రకటనలు చేస్తున్నారన్నారని, కానీ మోడీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు ఇవ్వడం లేదన్నారు. పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో ప్లాంట్‌ను నడవనివ్వడంలేదని విమర్శించారు. ప్లాంట్‌లో ఐదువేల పోస్టుల భర్తీకి అవకాశం ఉన్నప్పటికీ ఉన్న పర్మినెంట్, కాంట్రాక్టు కార్మికులను తొలగించటానికి యాజమాన్యం పూనుకుంటోం దన్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్‌ల ప్రకటనలకు.. కేంద్ర ప్రభుత్వ చర్యలకు పొంతనలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.జగన్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జిఎస్‌జె అచ్యుతరావు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి కుమార్, సిపిఐ, సిపిఎం నాయకులు బి.పద్మ, ఎండి బేగం, పి.మణి, ఎ దేముడమ్మ, వి.కృష్ణారావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.మన్మథరావు, ఆర్ శ్రీనివాసరావు, పి.చంద్రశేఖర్, క్షేత్ర పాల్ రెడ్డి, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు వై.కొండయ్య, ఐద్వా జిల్లా కార్యదర్శి వై.సత్యవతి, సిఐటియు నాయకులు వై.రాజు, ఎం.సుబ్బారావు, ఎస్.జ్యోతీశ్వరరావు, కుమార్ మంగళం, జి.అప్పలరాజు, ఎపి మహిళా సమాఖ్య జిల్లా నాయకులు బి.పుష్పలత తదితరులు పాల్గొన్నారు. ప్రజా నాట్యమండలి కార్యకర్తలు విప్లవ గీతాలు ఆలాపించారు.

ఉక్కు ప్రైవేటీకరణ రద్దును మోడీ ప్రకటించాలి: సీపీఐ

విశాలాంధ్ర - పెదగంట్యాడ: కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరణ చేసే ప్రయత్నాలను తక్షణమే విరమించు కోవాలని గాజువాక నియోజక వర్గ సీపీఐ డిమాండ్ చేసింది. మంగళ వారం ఉదయం పెదగంట్యాడ పోతిన సన్యాసిరావు భవన్ వద్ద నుండి పెదగంట్యాడ కూడలి వరకు సీపీఐ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో గాజువాక నియోజక వర్గ సీపీఐ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్ర మోడీ ఈనెల 8న విశాఖ పర్యటన సందర్భంగా విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేయబోమని స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరణ చేయడానికి కుట్రలు చేస్తుందని అన్నారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు కె.అచ్యుతరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు జి.ఆనంద్, మహిళా సమాఖ్య నేతలు కె.వనజాక్షి, పి.పద్మ, శివ, ఈశ్వర్, వినయ్, పెదపూడి దుర్గారావు పాల్గొన్నారు.

ఉక్కు దీక్షా శిబిరానికి చిత్ర యూనిట్

విశాలాంధ్ర - గాజువాక: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య చిత్ర యూనిట్ మంగళవారం కూర్మన్నపాలెం ఉక్కు దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. కూర్మన్నపాలెం కూడలిలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చేపడుతున్న 36 గంటల దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి దొడ్డి కొమరయ్య చిత్ర దర్శకులు ఎం.సేనాపతి మాట్లాడుతూ ప్రజల సంపద అయిన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు కట్ట బెట్టే ప్రయత్నాలను విరమించుకోవాలని, త్యాగాల పునాదుల మీద ఏర్పాటైన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేట్‌పరం చేయడం కేంద్రానికి తగదన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులు అబ్దుల్ రహమాన్, తక్కల్లపల్లి విజయ్ కుమార్, రావుల శ్రీనివాస్, నాగ రాజు, మద్ది అప్పల రెడ్డి, ఉక్కు తెలంగాణ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి జి.ఆనంద్, ప్రతినిధులు బి.వెంకటేశ్వర్లు, ఎస్.బలరాం, వి.సహదేవ్ పాల్గొన్నారు.

రొక్కం కామేశ్వరరావుకి యుకియోటో లిటరరీ అవార్డు

విశాలాంధ్ర - విశాఖ: ప్రముఖ కవి, ఆకాశవాణి పూర్వ ఇన్చార్జి డైరెక్టర్ రొక్కం కామేశ్వరరావు 'ఇన్నర్ విజన్' కవితల సంపుటికి యుకియోటో లిటరరీ అవార్డ్సులో భాగంగా 2024వ సంవత్సరానికిగానూ "పొయెట్ ఆఫ్ ది ఇయర్ అవార్డు ప్రకటించారు. రొక్కంకామేశ్వరరావు రచించిన అనేక కవితల సంపుటిలు హిందీ, ఇంగ్లీష్, తమిళం, మరాఠీ, కన్నడ భాషలలో అనువాదం పొంది, ఎంతో ప్రఖ్యాతిని, ప్రజాదరణనూ పొందాయి. అందులో ముఖ్యమైన ఓ కవితల సంపుటి "అంతర్వీక్షణం". దీని ఆంగ్లానువాదమే "ఇన్నర్ విజన్". ఈ కవితానువాదం ఆధారంగానే యుకియోటో సంస్థ రొక్కం కామేశ్వరరావుగమని పొయెట్ ఆఫ్ ది ఇయర్ 2024 అవార్డుకి ఎంపిక చేసింది. ఈ నెల 11, 12 కోల్‌కత్తాలో జరిగే మూడవ లిటరరీ కార్నివాల్‌లో ఈ అవార్డును రొక్కం కామేశ్వరరావుకి అందజేస్తారు. ఈ సందర్భంగా ఆయనకు విశాఖ సాహితీ మిత్రులు ఉప్పల అప్పలరాజు, ఎస్.హనుమంతరావు, బసు పోతన, పిఏ రాజు, వి.శ్యామ్ సుందర్, బొట్ట అప్పారావు అభినందనలు తెలిపారు.

అవంతిలో ఫ్రెషర్స్ డే వేడుకలు

విశాలాంధ్ర - తగరపువలస: ప్రముఖ ఫార్మాసీ విద్యాసంస్థలలో ఒకటైన అవంతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌లో మంగళవారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అవంతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.బి. వెంకటపతి రాజు మాట్లాడుతూ జాతి భవిష్యత్తు నిర్మాణంలో విద్య యొక్క ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం, ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాల ప్రొఫెసర్ వి.గిరిజ శాస్త్రి, కేజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ రాధ కృష్ణన్ దేశారాజు, ప్రొఫెసర్ తేజస్వి వెంకప్పా కట్టిమణి, అవంతి గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ చైర్మన్ శ్రీ ముట్టంశెట్టి శ్రీనివాస్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విశాఖకు ప్రధాని మోడీ రాక

పోలీసుల వలయంలో విశాఖ
ఏయూ మైదానంలో సభా వేదిక ఏర్పాట్లు సర్వం సిద్ధం
డ్వాక్రా మహిళలను తరలించేందుకు కసరత్తు
ఆర్టీసీ, ప్రైవేట్ స్కూల్ బస్సులు ద్వారా భారీగా జన సమీకరణకు ఏర్పాట్లు
ఏర్పాట్లును పరిశీలించిన హోం మంత్రి, పలువురు ఎమ్మెల్యేలు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: దేశ ప్రధాని నరేంద్ర మోడీ బుధవారం విశాఖ రానున్న నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు విశాఖ చేరుకోను న్నారు. సాయంత్రం 4:15 గంటలకు ఐఎన్ఎస్ డేగాలో చంద్రబాబుతో కలిసి మోడీకి పవన్ కల్యాణ్ స్వాగతం పలకనున్నారు. నగరంలో సిరిపురం జంక్షన్ నుండి సాయంత్రం జరగనున్న రోడ్ షోలో మోడీతో కలిసి చంద్రబాబు, పవన్ పాల్గొంటారు. సాయంత్రం 5:30 గంటల నుంచి ప్రధాని మోడీ బహిరంగ సభ ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో జరగనుంది. 7:25 గంటలకు గన్నవరానికి చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ వెళ్లనున్నారు. కూటమి ప్రభుత్వం భారీగా జన సమీకరణకు ఆర్టీసీ, ప్రైవేట్, స్కూల్ బస్సులను సైతం వదలకుండా డ్వాక్రా మహిళా సంఘాలకు ఇప్పటికే మోడీ సభకు తరలిరావాలని తాకీదులు చేరాయి. మంగళవారం రాత్రికి వార్డుల్లో బస్సులను పంపారు. ప్రభుత్వ ఉద్యోగులు, స్కీం వర్కర్లు ఈ సభకు తరలి రావాలని కూటమి నేతలు ఆదేశిం చడంతో అందరూ మోడీ సభ బాట పట్టారు. మంగళ వారం సాయంత్రానికే దాదాపు 7 వేలు మంది పోలీసులతో విశాఖ నగరం పోలీసుల వలయంలోకి వెళ్లిపోయింది.

అడుగడుగునా భద్రత నిఘా వర్గాలు తనిఖీలు ముమ్మరం చేశాయి. సంపత్ వినాయక గుడి రోడ్డు సిరిపురం మీదుగా ఏయూ ఇంజనీరింగ్ కళాశాల వెళ్లే రహదారిని మూసివేశారు. విశాఖలో పలు ప్రాజెక్టులకు మోడీ శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేయనున్నారు. ఈ సందర్భంగా హోంమంత్రి వంగలపూడి అనిత, పలువురు ఎమ్మెల్యేలు, కూటమి నేతలు, ప్రభుత్వ ఉన్నతాధికారులు సభా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా హోంమంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఘన విజయం సాధించిన తర్వాత తొలిసారిగా విశాఖకు ప్రధాని మోడీ వస్తున్నారని, పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయన్నారు. ప్రధాని మోడీ, ఏపీ సీఎం చంద్రబాబు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను రాష్ట్ర ప్రజలందరూ ఆశీర్వదించాలన్నారు.

ప్రధాని ప్రారంభించే ప్రాజెక్టులు ఇవే..

విశాఖపట్నానికి బుధవారం వస్తున్న ప్రధాని మోడీ ఏకంగా రూ.2 లక్షల కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేయనున్నారు. విశాఖపట్నం సమీపం పూడిమడక వద్ద జాతీయ హరిత హైడ్రోజన్ మిషన్ కింద మొదటి గ్రీన్ హైడ్రోజన్ హబ్‌కు, అత్యాధునిక ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ ప్రాజెక్టుకు ఆయన శంకుస్థాపన చేయనున్నారు. ఏపీలో చేపడుతున్న రూ.19,500 కోట్ల విలువైన రైల్వే, రోడ్డు ప్రాజెక్టులకు సంబంధించి కొన్ని పనులకు ప్రధాని శంకుస్థాపన చేయనుండగా, మరికొన్నింటిని ప్రారంభిస్తారు. విశాఖ దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రధాన కార్యాలయానికి సైతం ప్రధాని మోడీ శంకుస్థాపన చేయనున్నారు. అలాగే మరికొన్ని ఇతర ప్రాజెక్టులను ప్రధాని జాతికి అంకితం చేయనున్నారు. మరోవైపు అనకాపల్లి జిల్లా నక్కపల్లి బల్క్ డ్రగ్ పార్క్, తిరుపతి జిల్లాలో చెన్నై- బెంగళూరు పారిశ్రామిక కారిడార్ పరిధిలోని కృష్ణపట్నం క్రిస్ సిటీకి ప్రధాని మోడీ శంకుస్థాపన చేస్తారు. నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ కింద క్రిస్ సిటీని గ్రీన్ ఫీల్డ్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతారు. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు రూ.10,500 కోట్ల పెట్టుబడులను ఆకర్షించనున్నారు. ఇప్పటికే నగరంలో ఏర్పాట్లను పూర్తి చేశారు. కట్టుదిట్టమైన భద్రత నడుమ విశాఖ నగరం పోలీసులు వలయంలో ఉంది.

కేజీబీవీని సందర్శించిన సోషల్ ఆడిట్ బృందం

విశాలాంధ్ర - భీమిలి: భీమిలి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని మంగళవారం సోషల్ ఆడిట్ టీమ్ ఆకస్మికంగా తనిఖీ చేసింది. సోషల్ ఆడిట్ బృందం ఎస్.ఆర్.పి నాగరాజు, డి.ఆర్.పిలు పోలినాయుడు, శివప్రసాద్ ఈ తనిఖీలో భాగంగా

విద్యాలయంలో ఉన్న అన్ని రికార్డ్స్, స్టోర్, లైబ్రరీ, సైన్సు ల్యాబ్, రికార్డ్స్ చెక్ చేశారు. ప్రతీ ఒక్క స్టూడెంట్‌తో వ్యక్తిగతంగా మాట్లాడి వాళ్ళని అనేక విషయాలు అడిగి తెలుసుకున్నారు. యాజమాన్య కమిటీ మెంబర్స్‌తో కూడా మాట్లాడి విద్యాలయంకి సంబంధించిన విషయాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలకు సంబం ధించిన విద్యార్థుల ప్రోగ్రెస్‌ను ప్రిన్సిపాల్ గంగా కుమారి వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చింతలలోవలో ఇంట్లో చోరీ

విశాలాంధ్ర - మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతం పరిధి 63వ వార్డు చింతలలోవ గ్రామం ఆదర్శ్ రాయల్ పాఠశాల సమీప భవనంలో మంగళవారం దొంగతనం కలకలం రేపింది. పట్టపగలే దొంగలు దోపిడీకి పాల్పడడంతో అదే సమయంలో ఇంటి యజమాని మెలకువ వచ్చి కేకలు వేసేసరికి పక్కనే ఉన్న రేకుల ఇంటిపై దూకి తప్పించుకున్నాడని యజమాని తెలిపారు. రెండు లక్షల నగదు, మూడు తులాల వెండి దొంగతనానికి గురైనట్లు బాధితులు తెలిపారు. మల్కాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వీఎంఆర్డీఏ కార్యదర్శిగా మురళీ కృష్ణ, ఎస్టేట్ ఆఫీసర్‌గా దయానిధి

విశాలాంధ్ర - విశాఖ : వీఎంఆర్డీఏ కార్యదర్శిగా రెవెన్యూ డిప్యూటీ కలెక్టర్ పి. మురళీ కృష్ణ, ఎస్టేట్ ఆఫీసర్ గా డిప్యూటీ కలెక్టర్ బి.దయానిధిలను ప్రభుత్వం నియమించింది. చాలా కాలంగా కార్యదర్శి, ఎస్టేట్ ఆఫీసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కార్యదర్శిగా నియమితులైన మురళీ కృష్ణ తోటపల్లి ప్రాజెక్టు యూనిట్ 3 భూ సేకరణ విభాగం డిప్యూటీ కలెక్టర్ గా ఉన్నారు.

సైబర్ సెక్యూరిటి, మెషిన్ లెర్నింగ్‌పై నైపుణ్యత అవసరం

విశాలాంధ్ర - మధురవాడ: ఐటి, పారిశ్రామిక రంగాలలో మెషిన్‌లెర్నింగ్ సైబర్ సెక్యూరిటి అంశాలకు పెరుగుతున్న ప్రాధాన్యత దృష్ట్యా విశ్వవిద్యాలయాలలోని అధ్యాపకులకు వీటిపై నైపుణ్యత పెరగాల్సిన అవసరం ఉందని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి వైస్ ఛాన్స్‌లర్ వై.గౌతమ్ రావు పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని ఇఇసిఇ విభాగం ఆధ్వర్యంలో మెషిన్ లెర్నింగ్ ఆధారిత సిగ్నల్ ప్రాసెసింగ్, సైబర్ సెక్యూరిటి అల్గారిథమ్స్ అనే అంశంపై అధ్యాపకులకు శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఇంజనీరింగ్ విద్యలో అన్ని కోర్సులలోను మెషిన్‌లెర్నింగ్, కృత్రిమ మేధ అంశాలను బోధిస్తున్న నేపధ్యంలో అధ్యాపకులు నిరంతర అధ్యయనం ద్వారా ఈ అంశాలపై లోతైన పరిజ్ఞానం కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమానికి బెంగళూరులోని ప్రఖ్యాత ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ శాస్త్రవేత్త డాక్టర్ కె.సోలమన్‌రాజు ప్రధాన వక్తగా హాజరయ్యారు. కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజి డైరక్టర్ కె.నాగేంద్రప్రసాద్, స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ డీన్ ప్రొఫెసర్ వి.రామశాస్త్రి, ఇఇసిఇ విభాగం అధిపతి ప్రొఫెసర్ పి.భరణి చంద్రకుమార్, ఎఫ్‌డిపి కన్వీనర్‌లు డాక్టర్ జి.అనిత, డాక్టర్ కె.రేణు, డాక్టర్ ఐ.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మకం రద్దు ప్రకటన చేయాలి

విశాలాంధ్ర - పెందుర్తి: ఈనెల 8న విశాఖ పర్యటనకు వస్తున్న ప్రధాని నరేంద్రమోడీ విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని రద్దు చేస్తున్నట్లు, సొంతగనులు కేటాయిస్తున్నట్లు, ప్లాంట్‌ను పూర్తిస్థాయి ఉత్పత్తి సామర్థ్యంతో నడిపించేందుకు అన్నివనరులు కేటాయిస్తున్నట్లు స్పష్టంగా ప్రకటించాలని సిఐటియు పెందుర్తి జోన్ కార్యదర్శి జి.శంకర్రావు డిమాండ్ చేసారు. సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం ముఠా కార్మికులు చిన్న పరిశ్రమలు వద్ద బ్లాక్ బ్యాడ్జీలు పెట్టి నిరసన తెలియజేసారు. ఈ సందర్భంగా శంకర్రావు మాట్లాడుతూ గత నాలుగేళ్ళుగా విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకోసం, స్టీల్‌ప్లాంట్‌కు సొంతగనులు కేటాయిం చాలని ఉద్యమం జరుగుతుంటే కనీసం మోడీ నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారన్నారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో రెండేళ్ళ క్రిందట ఇదే ఆంధ్రా యూనివర్శిటీ గ్రౌండ్‌కు వచ్చేటప్పుడు ప్రతి పక్షంలో ఉన్న చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్ మోడీ స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్‌ను గుర్తుంచుకోవాలన్నారు. ఈ రెండేళ్ళలో స్టీల్‌ప్లాంట్ బ్లాక్ ఫర్నేస్‌లను మూసివేసి ఉత్పత్తి తగ్గించే కుట్రలు పన్నడమేకాకుండా ఉద్యోగులకు, కార్మికులకు జీతాలు చెల్లించకుండా తీవ్ర ద్రోహంకు వడిగట్టారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్,రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌లు స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదని ప్రకటనలు చేస్తున్నారన్నారు. కానీ కేంద్ర మోడీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌కు సొంతగనులు, సొంత ఇనుజ ఖనిజ గనులు ఇవ్వడంలేదన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటి నాయకులు కే.అప్పలనాయుడు, మరిడియ్య, రమణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజానాట్యమండలి నూతన కమిటీ ఏర్పాటు

విశాలాంధ్ర - తగరపువలస: భీమిలి ప్రజానాట్యమండలి జోన్ కమిటీ జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నుకోబడిన కమిటీ సభ్యులు మాట్లాడుతూ సంస్కృతకల రంగాల్లో ప్రజానాట్యమండలి ముందుంటుందని ప్రభుత్వాలు విధానాలని ఎండగడుతూ సామాన్య ప్రజలు కార్మికుల దగ్గరికి వెళ్లడానికి ప్రయత్నిస్తుందని, ప్రజలపై పడుతున్న భారాలను ప్రభుత్వ విధానాలను తమ కళా పాటల ద్వారా ప్రజలను చైతన్య పరుస్తూ ప్రజానాట్యమండలి ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. ప్రజలు కళాకారులు కార్మికులు కావాలని అన్నారు.

ఈ కమిటీకి గౌరవ అధ్యక్షులుగా దల్లి రాంబాబు, అధ్యక్షులుగా పల్ల పోతురాజు, జనరల్ సెక్రెటరీగా బెలాని రామకృష్ణ, ఉపాధ్యక్షుడిగా చిల్ల అప్పారావు, కోశాధికారిగా పంపాన సూర్యనారాయణ, కమిటీ నెంబర్లుగా ఎస్.ఉమా, ఎస్.లక్ష్మి, రమణ, గంగయ్యని ఎన్నుకున్నారు.

వేములవలసలో 1000 సభ్యత్వాలు

కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలం వేములవలస పంచాయతీలో రికార్డు స్థాయిలో టీడీపీ సభ్యత్వ నమోదు జరిగినట్లు ఆ పార్టీ యువ నాయకుడు స్థానిక పంచాయితీ ఉప సర్పంచ్ కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్ చెప్పారు. ఆయన మంగళవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. సభ్యత్వ నమోదులో ముఖ్యంగా యువత అధిక సంఖ్యలో ముందుకు రావడం విశేషం అన్నారు. తమ పంచాయితీకి ఎనిమిది వందల ముప్పై నాలుగు సభ్యత్వాలు చేయించాలన్న నిర్దేశిత లక్ష్యాన్ని అధిగమించి 1000 మందికి సభ్యత్వ నమోదు జరిపినట్లు చెప్పారు. అందరికీ ఉచితంగా సభ్యత్వాలు అందించామన్నారు. ఇందుకు తన సొంత నిధులు వ్యయం చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ పాలన చూసి చాలా మంది స్వచ్ఛందంగా ముందుకు రావడం పట్ల కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్ సంతోషం వ్యక్తం చేశారు.

పెంటమాంబ అమ్మవారి నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

విశాలాంధ్ర - పెదగంట్యాడ: నెల్లిముక్కు గ్రామపంచాయతీ నిర్వాసిత గ్రామాల ప్రజల ఆరాధ్య దేవత శ్రీ పెంటమాంబ అమ్మవారి ఆలయం నూతన కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం ఘనంగా జరిగింది. ఈ సంవత్సరం ఉగాది నుండి మొదలుఅయ్యి 14 రోజుల పాటు అమ్మవార్ల ఘటలతో జరగబోవు పండుగ అత్యంత వైభవంగా జరిపిస్తామని సభ్యులు ప్రమాణం చేశారు. నెల్లిముక్కు గ్రామ పంచాయతీ పరిధిలో గల దొడ్డి పెద్దలు, గ్రామ పెద్దలు తో పాటు ఆలయ కమిటీ డైరెక్టర్లు గొందేశీ మహేశ్వరరెడ్డి, పులి రమణారెడ్డి, గొందేశీ అప్పలరెడ్డి, గొందేశీ సత్యారావు, యేల్లేటి శ్రీనివాసరావు, కె ఎస్ రెడ్డి, గంట్యాడ పైడిరాజు సమక్షంలో ఆలయ ప్రధాన అర్చకులు సుబ్రహ్మణ్య శర్మ అమ్మ వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సమావేశంలో పిట్ట కుంచరావు, ముద్దర్తి శ్రీరామమూర్తి, పాల అప్పారావును కోశాధికారులగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు శ్రీ పెంటమాంబ ఆలయ కమిటీ ప్రతిష్టను కాపాడుతామని ప్రతిజ్ఞ చేశారు.

మోడీ సభను విజయవంతం చేయండి

విశాలాంధ్ర - ఆనందపురం: భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విశాఖకు రానున్న సందర్భంగా పర్యటనను విజయవంతం చేయాలని నాయకులు కోరారు. ప్రధానమంత్రికి భారీ సంఖ్యలో స్వాగతం పలికి రోడ్ షోను విజయవంతం చేయాలని భీమిలి జనసేన పార్టీ ఇన్చార్జ్ డాక్టర్ సందీప్ పంచకర్ల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆనందపురం మండలం విశాఖ రూరల్ కార్యదర్శి మజ్జి శ్రీను, మండల పార్టీ అధ్యక్షులు తమ్మిన అప్పలరాజు, ప్రధాన కార్యదర్శి కోరుకొండ మూర్తి, ఉపాధ్యక్షులు శివకృష్ణ, బాలు, మండల కార్యదర్శిలు డాక్టర్ సన్యాసిరావు, గోవింద్, ప్రశాంత్, సురేష్, నాని, మండల కమిటీ నాయకులు పాల్గొన్నారు.

ఉల్లాసభరితంగా డైట్‌లో రంగోలి పోటీలు

విశాలాంధ్ర - భీమిలి: భీమిలి జిల్లా విద్యా శిక్షణ సంస్థలో జిల్లా స్థాయి రంగవల్లుల పోటీలు నిర్వహించారు. జాయింట్ డైరెక్టర్, డైట్ ప్రిన్సిపాల్ ఎం.జ్యోతి కుమారి ప్రారంభించారు. విద్యార్థుల్లో జాతీయ సమైక్యత సృజనాత్మకత భాషాభివృద్ధి అంశాలలో నైపుణ్యాలు పెంపొందించే ఉద్దేశంతో భారత ప్రభుత్వం సమగ్ర శిక్ష ద్వారా రంగోలి పోటీలు నిర్వహిస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు సంపాదించాలని అన్నారు. 6 నుంచి 12 తరగతి విద్యా ర్థులు 150 మంది 10 పాఠశాలలకు ప్రాతినిధ్యం వహిస్తూ ఈ పోటీలలో పాల్గొన్నారు. ఈ పోటీలకు డైట్ సీనియర్ అద్యాపకులు ఎల్.సుధాకర్, జీజీఎస్ నాగేశ్వర రావు, అధ్యాపకులు ఎస్.త్రినాధరావు, జె.మాధవి, ఎం.మహాలక్ష్మి, సిఏ సోమయాజులు, ఎన్.నీలిమలు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పలు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

విశాలాంధ్ర - సాగర్‌నగర్: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం (టిటిడి)లో మంగళవారం ఆలయ శుద్ధి, కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తకంగా నిర్వహించారు. ఈ నెల 10వ తేదీన నిర్వహించనున్న వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం సాంప్రదాయం ప్రకారం ముందుగా వచ్చే మంగళవారం ఈ కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహిస్తారు. ఈ మేరకు ఉదయం నుండి మధ్యాహ్నం వరకు ఆలయాన్ని సుగంధ ద్రవ్యాలతో శ్రీవారి ఆలయం, హనుమాన్, మహాలక్ష్మి, గోదాదేవి ఆలయాలను శుద్ధిచేసి అనంతరం మద్యాహ్నం నుండి భక్తులకు సర్వ దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ జగన్ మోహ నాచార్యులు, సూపరిటెండెంట్ వెంకటరమణ, ఇన్‌స్పెక్టర్లు శివకుమార్, కిషోర్, శ్రావణ్ పాల్గొన్నారు.